నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 27 జూలై 2024 | ADILABAD NIRMAL


## ఆర్జీయూకేటీలో ముగిసిన మూడో దశ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న యూనివర్సిటీ అధికారులు

ముథోల్, జూలై, 26: నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆరేళ్ల సమీకృత విధానంలో పీయూసీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులకు నిర్వహించిన మూడో దశ కౌన్సెలింగ్ ముగిసింది. క్యాంపస్ ప్రాంగణంలోని అకాడమిక్ బ్లాక్‌లో మూడో దశ మెరిట్ జాబితా విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, గ్లోబల్ కోటా విద్యార్థుల జాబితాను శుక్రవారం విడుదల చేశామని, ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరి సీట్లను త్వరలో భర్తీ చేస్తామని దానికి సంబంధించిన తేదీలను ఖరారు చేస్తామని తెలిపారు.

## బజార్‌హత్నూర్ వైన్స్‌లో చోరీ

-రూ.2.15 లక్షల విలువైన మద్యం అపహరణ



వైన్స్ షాపును పరిశీలిస్తున్న పోలీసులు

బజార్‌హత్నూర్, జూలై 26 :మండలంలోని గిర్నూర్ గ్రామసమీపంలోని లక్ష్మీసాయి వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బోథ్ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం..గిర్నూర్ గ్రామసమీపంలోని లక్ష్మీసాయి వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు వైన్స్ షటర్‌తో పాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి రూ.2.15 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న బోథ్ సీఐ రమేశ్, ఎస్ఐ నరేశ్, క్లూస్ టీం సిబ్బంది వచ్చి విచారణ చేపట్టారు. వైన్స్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నాడు తండ్రి.. నేడు తల్లి

- అనారోగ్యంతో ఇద్దరి మృతి ● అనాథలైన కూతుళ్లు
- విరాళాలతో తల్లి అంత్యక్రియలు ● మందమర్రిలో హృదయవిదారక ఘటన
- ఆర్థిక స్థోమత లేక ఆగిన పెద్ద కుమార్తె పెళ్లి ● కనీసం ఇల్లులేని దీనస్థితి
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు ● ఫోన్ పే : 7670932632



దహన సంస్కారాల్లో మృత దేహం వద్ద రోదిస్తున్న కూతుళ్లు అర్చన, అభిలాష

మందమర్రి, జూలై 26 : నాడు అనారోగ్యంతో తండ్రి.. నేడు ప్రమాదవశాత్తు తల్లి మృతి చెందగా, పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కూతుళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. కనీసం తల్లి అంత్యక్రియలకు చేతిలో చిల్లి గవ్వ లేకపోగా, స్థానికులు అందించిన విరాళాలతో ఆ తంతును పూర్తి చేయాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన మందమర్రి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన భూనేని దూనాచారి-లక్ష్మి(40) దంపతులకు అర్చన(21), అభిలాష(17) కూతుళ్లున్నారు. పదేళ్లక్రితం భూనేని దూనాచారి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన అన్న బైర్నేని చందు ఇంట్లో, ఇద్దరు కూతుళ్లతో కలిసి ఉంటోంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇద్దరు కుమార్తెలు పదో తరగతితోనే చదువు ఆపేశారు. ఆపై ముగ్గురూ కలిసి కూలీ పనులు చేస్తున్నారు. 8 నెలల క్రితం పెద్ద కూతురు అర్చన వివాహం నిశ్చయమైంది. ఆర్థిక స్థోమత లేక పెండ్లిని వాయిదా వేస్తూ వచ్చింది. ఇంతలోనే విధి వారిని పగబట్టింది. ఈ నెల 17న లక్ష్మి ఇంటి వద్ద పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తలలో రక్తం గడ్డ కట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న కూతుళ్లకు గ్రామస్తులు, బంధువులు తోడయ్యారు. కొంత మేర విరాళాలు సేకరించి అందించడంతో లక్ష్మిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి గురువారం రాత్రి మరణించింది. శుక్రవారం గ్రామానికి తీసుకురాగా, అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో స్థానికులు, బంధువులు విరాళాలు అందజేశారు. ఆపై చిన్న కూతురు అభిలాష.. అక్క అర్చనతో కలిసి తల్లికి అంత్యక్రియలు నిర్వహించింది. వారిద్దరు రోదించిన తీరు అక్కడున్న వారిని కలచి వేసింది. కనీసం ఇల్లు కూడా లేని దీన స్థితిలో ఉన్న తమను దాతలెవరైనా ఆదుకోవాలని ఆ అక్కాచెల్లెళ్లిద్దరూ వేడుకుంటున్నారు. సాయం చేయాలనుకునే వారు సెల్ నం. 7670932632కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు.

# వాన..వరద

- ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద ● పొంగిన వాగులు, ఒర్రెలు
- పలు చోట్ల కూలిన ఇండ్లు, విద్యుత్ స్తంభాలు
- తెగిన రోడ్లు..రాకపోకలకు అంతరాయం



బోథ్ : అలుగు దుంకుతున్న బోథ్ ప్రాజెక్టు

*ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వానలతో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహించాయి. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలకు వరద పోటెత్తింది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇండ్లు నేల కూలాయి. పలు గ్రామాల్లో రోడ్లు కొట్టుకపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది.*



జైనథ్ : సాత్నాల ప్రాజెక్టులో 284.50 అడుగుల నీటి మట్టం

### కడెం ప్రాజెక్ట్‌కు పోటెత్తిన వరద

కడెం, జూలై 26 : నాలుగు రోజులుగా వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి కడెం ప్రాజెక్టులోకి వరద నీరు కొనసాగుతున్నది. దీంతో శనివారం అధికారులు వరద గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు(7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 692.675 (5.832 టీఎంసీలు) అడుగులు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్ట్‌లోకి 4662 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో దీంతో అధికారులు ఒక గేటు ఎత్తి దిగువకు 4662 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### నిర్మల్ జిల్లాలో 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం

నిర్మల్ అర్బన్, జూలై 26 : నిర్మల్ జిల్లాలో గత 24 గంటల్లో సగటున 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కుభీర్‌లో 2.8 మిలీ మీటర్లు, తానూర్‌లో 9.2, బాసరలో 8.0, ముథోల్‌లో 9.4, భైంసాలో 7.0, కుంటాలలో 8.6, నర్సాపూర్ జీలో 4.8. లోకేశ్వరం 14.2, దిలావర్‌పూర్‌లో 16.4, సారంగపూర్‌లో 13.2, నిర్మల్ 12.8, నిర్మల్ రూరల్ 15.0, సోన్ 12.6, లక్ష్మణచాంద 8.4, మామడ 8.6, పెంబి 7.6, ఖానాపూర్ 11.6, కడెం 12.4, దస్తూరాబాద్ 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

### నిండుకుండలా బోథ్ ప్రాజెక్టు

బోథ్, జూలై 26: బోథ్ (కరత్వాడ) ప్రాజెక్టుకు జలకళ సంతరించుకున్నది. నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. అలుగు దుంకుతున్నది. ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో కుడి, ఎడమ కాల్వల ద్వారా 4900 ఎకరాల ఆయకట్టుకు నీరందే అవకాశం ఏర్పడింది. ప్రాజెక్టు నిండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో సమృద్ధిగా నీరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### సాత్నాల ప్రాజెక్టుకు జలకళ

జైనథ్, జూలై 26 : ఎగువ ప్రాంతం లో వర్షాలకు భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 286.50 అడుగులకు గాను ప్రస్తుతం 284.50 అడుగులకు చేరిందని అధికారులు తెలిపారు.



దిలావర్‌పూర్ : రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

### కూలిన విద్యుత్ స్తంభాలు..

దిలావర్‌పూర్ జూలై 26 : ఈదురు గాలులతో కూడిన వర్షంతో దిలావర్‌పూర్ మండలంలోని న్యూ లోలం, దిలావర్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో చెట్లు కూలాయి. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడడంతో స్తంభాలు విరిగి పడ్డాయి. లోలం గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

### వర్షానికి కూలిన ఇల్లు

లక్ష్మణచాంద, జూలై 26 : మండల కేంద్రంలోని బ్రహ్మదండి రాములుకు చెందిన ఇల్లు ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు రాములు భార్య బ్రహ్మదండి ముత్తవ్వ కోరింది.



జైనథ్ : నిండుకుండలా సాత్నాల ప్రాజెక్టు



లక్ష్మణచాందలో వర్షానికి కూలిన ఇల్లు



ఆదిలాబాద్ ఫొటో గ్రాఫర్ : నిండుగా ప్రవహిస్తున్న చందా(టీ) వాగు



దిలావర్‌పూర్ : న్యూ లోలంలో ఈదురుగాలులకు విరిగిన విద్యుత్ స్తంభం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

## అంగన్‌వాడీలను సమర్థవంతంగా నిర్వహించాలి

- నాణ్యమైన పోషకాహారం అందించాలి ● నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై, 26: అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలన్నారు. ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి బాలామృతం అందించాలని సూచించారు. డైట్ చార్టులను ఉంచడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా పెయింటింగ్స్, బొమ్మలు, ఇతర ఆట వస్తువులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. మెనూ, హాజరు వివరాల రిపోర్టులను పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల ఫైజాన్ అహ్మద్) మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నాగమణి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, సీడీపీవోలు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

## 'డయల్ 100' కాల్స్‌కు తక్షణమే స్పందించాలి

- బాధితులకు సకాలంలో సహాయం అందించాలి
- పోలీసులకు నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశం

నిర్మల్ అర్బన్, జూలై 26 : జిల్లాలో డయల్ 100 సేవలను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హైదరాబాద్ నుంచి డీజీపీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. డయల్ 100 సేవలపై అధికారులతో చర్చించారు. కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ మాట్లాడారు. డయల్ 100 సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో ప్రజలకు భద్రత, సత్వర సహాయం అందించవచ్చని తెలిపారు. కాల్స్‌పై తక్షణమే స్పందించి నిమిషాల్లో బాధితుల ముందు ఉండాలని ఆదేశించారు. ఆకతాయిలు చేసే ఫేక్ కాల్స్‌పై పెట్టాలని, వారిని స్టేషన్‌కు పిలిచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు ప్రవీణ్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అశోక్, గోపీనాథ్, కంట్రోల్ రూం, ఐటీ సెల్ సిబ్బంది తదితరులున్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుభాష్ ● ఆదిలాబాద్, బోథ్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం



బోథ్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎదులాపురం/బోథ్, జూలై 26 : జూలై 26 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకు తీవ్రంగా అన్యాయం జరిగిందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుభాష్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొన్నారు. దళితుల సంక్షేమానికి గత ప్రభుత్వం రూ.36, 750 కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.33,150 కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా బడ్జెట్‌లో దళితులకు నిధులు తక్కువగా కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో దళిత మోర్చా నాయకులు ధరంపాల్, మల్లు, కిరణ్, దయాకర్, శ్రీనివాస్, కిశోర్, రాజు, ప్రమోద్ తదితరులున్నారు.

### బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించకపోవడంపై నిరసన

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ఆదిలాబాద్ జిల్లాకు, బోథ్ నియోజకవర్గానికి ఎలాంటి కేటాయింపులు చేయనందుకు నిరసనగా శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి దిష్టిబొమ్మను దహనం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో నాయకులు పతంగి బ్రహ్మానందం, రైల్వే బోర్డ్ మెంబర్ జీవీ రమణ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనంచేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా సభ్యులు

## వీర జవాన్ల త్యాగాలు మరువలేనివి

-అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, జూలై 26: మాతృ భూమి రక్షణ కోసం శత్రు దేశాలతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్ల త్యాగాలు మరువలేనివని అదనపు కలెక్టర్ శ్యామలా దేవి అన్నారు. శుక్రవారం కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్గిల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర వీరుల స్తూపం వద్ద అనంతరం మాజీ సైనికుల సంఘం ప్రతినిధులు, ఎన్‌సీసీ కెడేట్లతో కలిసి నివాళులర్పించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. వారి త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, రవీందర్, ఆనంద్, లచ్చు, సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు శంకర్ దాస్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

## ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



సుందాబాయి (ఫైల్)

కుభీర్, జూలై 26 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని డోడర్న తండా-5 గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కింద పడి వృద్ధురాలు జాదవ్ సుందాబాయి(65) మృతి చెందింది. కుభీర్ ఎస్ఐ రవీందర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..డోడర్న తండా-5 గ్రామానికి చెందిన సుందాబాయి నందగావ్‌లో బంధువు అంత్యక్రియలకు వెళ్లింది. తిరిగి వచ్చేందుకు భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. డోడర్న తండా-5కు (సేవాలాల్ చౌక్ స్టాప్) ఘాట్ రోడ్డు మూల మలుపు వద్ద దిగుతుండగా బస్సు ఎడమ వైపు ఉన్న వెనుక టైర్ కింద పడిపోయింది. కాళ్లు, చేతు విరిగి తీవ్రగాయాలవడంతో ఆమెను అదే బస్సులో భైంసా ఏరియా దవాఖానకు, అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. డ్రైవర్ పోచంపాడు నర్సయ్య అజాగ్రత్తగా బస్సును నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.